క్లుప్తంగా

ప్రత్యామ్నాయ మార్గం చూపాలని వినతి

మల్కాపురం: డాక్‌యార్డ్ వద్ద గల సర్దార్ వల్లబాయ్ పటేల్ వంతెనపై వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఎమ్మెల్యే గణబాబును కోరారు. ఎమ్మెల్యేను మంగళవారం ఆయన నివాసం వద్ద కలిసిన నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందించారు. మల్కాపురం, శ్రీహరిపురం, సింధియా తదితర ప్రాంతాల ప్రయాణికులు నిత్యం డాక్‌యార్డ్ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారని, అయితే బ్రిడ్జి మరమ్మతుల కారణంగా వాహనాలు నిలిపివేస్తామని అధికారులు చెప్పడంతో ప్రత్యామ్నాయ మార్గం లేక వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. వారి సమస్యను గుర్తించి, సులభతరంగా ఉండే ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై సదస్సు నేడు

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహిస్తున్నారు. 'సంక్షోభంలో విశాఖ ఉక్కు – పరిష్కారం ఎలా ' అనే అంశంపై సాయంత్రం 5.30 గంటలకు ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో సదస్సు ప్రారంభం కానుంది. స్టీల్‌ప్లాంట్ పూర్వ సీఎండీ వై.శివసాగరరావు, సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జె.డి.లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు సదస్సులో పాల్గొనున్నారు. సదస్సుకు ఉద్యోగులందరూ హాజరు కావాలని సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి కోరారు.

శ్రీవారికి తిరుప్పావడ సేవ నేడు

అక్కిరెడ్డిపాలెం: బిల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో బుధవారం తిరుప్పావడ సేవ (అన్న కూటోత్సవం)ను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథరావు తెలిపారు. పులిహోరను రాశిగా పోసి, ప్రసన్న వేంకటేశ్వరుడికి నివేదించిన అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.


ఉచితంగా కళ్లద్దాల పంపిణీ



కళ్లద్దాలు అందజేస్తున్న కార్పొరేటర్ ముక్కా శ్రావణి

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి ఆధ్వర్యంలో శాంతిపురంలో గల కార్పొరేటర్ కార్యాలయంలో ఉచితంగా కళ్లద్దాల పంపిణీ చేశారు. జిమ్‌సర్, గీతం హాస్పిటల్ సంయుక్తంగా ఇటీవల వార్డులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటిచూపు సరిగా లేని వారిని గుర్తించి వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించారు. చికిత్స చేయించుకున్న వారికి మంగళవారం ఉదయం కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన



రైల్వేన్యూకాలనీలో రహదారి పనులు జరుగుతున్న దృశ్యం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులను మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల లీలావతి శ్రీనివాస్ పరిశీలించారు. రైల్వేన్యూకాలనీ, జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ వీధిలో నూతనంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తున్నారు. రూ.20లక్షల నిధులతో చేపట్టిన ఈ పనులను ఆళ్ల శ్రీనివాస్ పరిశీలించారు.



వైద్యం.. దైన్యం



గోపాలపట్నం ఆస్పత్రిలో వైద్యం కోసం వేచి ఉన్న స్థానికులు

వైద్యం కోసం ఎక్కడికో పరుగులు తీయాల్సిన అవసరం లేదు. వేలకు వేలు డబ్బు ఖర్చు చేయాల్సిన అగత్యం అంతకన్నా లేదు. పేదల ముంగిటే కార్పొరేట్ వైద్యం అన్న ఆశయంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వార్డుల్లోనే యూపీహెచ్‌సీలను ఏర్పాటు చేసింది. నిపుణులైన వైద్యులు, ఖరీదైన మందులతో వారికి సేవలు అందించింది. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత యూపీహెచ్‌సీల్లో వారమంతా సేవలందించే స్పెషలిస్ట్ వైద్యుల సేవలను నిలుపుదల చేసింది. దీంతో పేదలు సంపూర్ణ వైద్యసేవలకు దూరమయ్యారు. ఇప్పుడు పలు వార్డుల్లోని యూపీహెచ్‌సీలకు రోజువారీ వచ్చే ఓపీ సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది.

- స్పెషలిస్ట్ వైద్యుల సేవలకు మంగళం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందంటూ ఆవేదన

గోపాలపట్నం : పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ వైద్యులు కనుమరుగయ్యారు. ఈ సౌకర్యానికి చంద్రబాబు ప్రభుత్వం నెలరోజుల గడువులో మంగళం పాడేసింది. స్థానిక ప్రజలకు వైద్య పరంగా మేలు జరుగుతున్న నేపథ్యంలో ఈ వైద్య సౌకర్యం తొలగించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వారంలో మూడు రోజుల పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో దంత, గైనిక్, పిల్లల వైద్య నిపుణులు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించేవారు. ప్రత్యేకంగా వీరి కోసం ఎదురు చూసే వారు నిత్యం ఉండేవారు. ఇపుడు ఈ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాలైన లక్ష్మీనగర్, కొత్తపాలెం, బుచ్చిరాజుపాలెంలో పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఈ ఆస్పత్రులకు వారంలో మూడు రోజులు స్పెషలిస్టు వైద్యులు వచ్చి వైద్య సేవలు అందిస్తుండేవారు. ఇపుడు వీరు రాకపోవడంతో సంబంధిత వైద్యం కోసం నగరంలోకి, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత పరిధి 58, 59, 61 వార్డుల పరిధిలో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసి, స్పెషలిస్ట్ వైద్యులను అందుబాటులో ఉంచింది. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో జనరల్ వైద్యులతో పాటు చిల్డ్రన్, గైనిక్, ఆర్థో, స్కిన్ స్పెషలిస్టు, ఈఎన్‌టీ, దంత వైద్యులు వారంలో ఒకరోజు ఆస్పత్రుల్లో రోగులకు సేవలు అందించేవారు. ప్రస్తుతం జనరల్ వైద్యులు, చిల్డ్రన్, ప్రసూతి వైద్యులు మాత్రమే ఉన్నారు. మిగిలిన వైద్యులను ప్రభుత్వం తొలగించింది. దీంతో ఆయా వైద్య సేవల కోసం ఆస్పత్రుల వద్దకు వస్తున్న రోగులు వైద్య నిపుణులు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.



కొత్తపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం

సేవలు పునరుద్ధరించాలి..



పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్ట్ వైద్యుల సేవలు పునరుద్ధరించాలి. ఈ సేవలు పేదలకు వరంలా ఉండేవి. పేదలు ఈ వైద్యం కోసం డబ్బు, సమయం వృథా చేసుకోవలసి వస్తోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం. పేదల కష్టాలు తెలుసుకుని ఇప్పటికైనా ఈ సేవలు కొనసాగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

– విజయ్, చంద్రనగర్

స్పెషలిస్ట్ వైద్యుల వల్ల మేలు జరుగుతుంది..



స్పెషలిస్టు వైద్యులు గతంలో ఇక్కడి పట్టణ ఆరోగ్య కేంద్రానికి వచ్చేవారు. వారు వచ్చే సమయంలో చాలా మంది పేదలు వారి సేవల్ని సద్వినియోగం చేసుకునే వారు. దీని వల్ల ఆరోగ్యాల్ని బాగు పరుచుకున్నారు. నేను కూడా పలు మార్లు మా బంధువుల్ని తీసుకు వెళ్లాను. వైద్యులు మంచి సలహాలు వైద్యం అందించేవారు. ఇపుడు ఆ సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఈ విధంగా చేయడం మంచిది కాదు.

– ఆళ్ల నాగేంద్ర, కొత్తపాలెం

ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.4వేలు ఖర్చయింది



నాకు ఆర్థో సమస్య రావడంతో ములగాడ హౌసింగ్ కాలనీలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్దకు వెళ్లాను. అయితే ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు రావడం లేదని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో గాజువాకలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే రూ.4వేలు ఖర్చయింది. మాలాంటి వారికి అది చాలా పెద్ద మొత్తం. కానీ తప్పలేదు. గతంలో ఉన్నట్లే ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ సదుపాయాలు కల్పిస్తే మాలాంటి వారికి ఎంతో మేలు.

– నారాయణరావు, మల్కాపురం

నిపుణుల సేవలు పునరుద్ధరించాలి



చర్మానికి సంబంధించిన సమస్య రావడంతో 58వ వార్డు ములగాడలోని పట్టణ ఆరోగ్య కేంద్రానికి వెళ్లాను. వైద్య నిపుణులెవ్వరూ ఇప్పుడు రావడం లేదని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చింది. వేలల్లో ఖర్చవుతోంది. ప్రభుత్వాస్పత్రుల్లో స్పెషలిస్ట్ సేవలు మళ్లీ అందుబాటులోకి తీసుకువరావాలి.

– కాకర ప్రకాష్‌రావు, ప్రకాష్ నగర్

సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలి

గోపాలపట్నం : నేవల్ ఆర్మ్‌మెంట్ డిపో సివిల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులకు భరోసా కల్పించాలని, సభ్యుల లోన్లు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ఎన్‌ఏడీ ప్రధాన గేటు వద్ద నేవల్ ఆర్మ్‌మెంట్ సివిలియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ ఎన్‌ఏడీ సివిలియన్ కోఆపరేటివ్ సొసైటి పాలక వర్గం సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోయారు. సభ్యుల లోన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయకుండా తాత్సారం చేస్తుందని దుయ్యబట్టారు. పాలక మండలి తీరు భయాందోళనలకు గురి చేస్తోందన్నారు. గతంలో ఉన్న పాలక మండలి సలహా కమిటీ ఏర్పాటు చేసుకుని సభ్యులకు సకాలంలో లోన్లు మంజూరు చేసేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా కార్మికులకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన లోన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

'అతిసార'పై అప్రమత్తత అవసరం



అతిసారపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, నాయకులు



అతిసారపై ప్రచారం చేస్తున్న స్టాలిన్ తదితరులు

గాజువాక: ప్రజలు అతిసార బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ సూచించారు. అతిసార వ్యాధి నివారణపై వార్డులోని చినగంట్యాడలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవడం వల్ల దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి పి.నాగ అప్పారావు, జీవీఎంసీ సీవో సూర్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

పెదగంట్యాడ: వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, వార్డు కూటమి నాయకులు పేర్కొన్నారు. అతిసార వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీలో డయేరియాపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో రట్టి వాసు, బైపిల్లి గాంధీ, సింగంపిల్లి దేముడు, రెయ్యి రత్న, కాకి స్వరూపారాణి, సమ్మిడి ఉమ, పోతిన వెంకటేశ్వరరావు, ప్రజారోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి తులసీదళార్చన

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆషాఢ శుద్ధఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. 9గంటలకు శ్రీవారికి తులసీ దళార్చన ఉంటుందన్నారు. 10గంటలకు సామూహిక విష్ణు సహస్ర పారాయణం ఉంటుందన్నారు.

300ఎన్ బస్ సర్వీసు పునరుద్ధరణ

- కాంప్లెక్స్ నుంచి సబ్బవరానికి బస్సు ప్రారంభం



కొత్తపాలెంలో బస్ సర్వీసు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సబ్బవరం వరకు 300ఎన్ ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే గణబాబు కొత్తపాలెంలో మంగళవారం ప్రారంభించారు. పదిహేనేళ్ల అనంతరం ఈ సర్వీసును పునఃప్రారంభించారు. గతంలో కొత్తపాలెం మీదుగా బస్సు సర్వీసు ఉండేది. రహదారి బాగా లేకపోవడంతో 2009లో ఈ సర్వీసును నిలిపివేశారు. దీంతో సబ్బవరానికి బస్సు లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. ఇటీవల రైల్వే అధికారులు అండర్ పాస్‌వే నిర్మించడంతో బస్ సర్వీస్‌ను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ బస్సు విద్యార్థులకు, ఉద్యోగులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ కాంప్లెక్స్ నుంచి ఎన్‌ఏడీ మీదుగా బాజీ జంక్షన్, పాత గోపాలపట్నం, కొత్తపాలెం మెయిన్ రోడ్డు మీదుగా నరవ, సబ్బవరం వెళ్తుందని తెలిపారు. ఉదయం 6.30గంటలకు కాంప్లెక్స్ నుంచి బయల్దేరి సబ్బవరం 7.45కి చేరుకుంటుందని, గంటంపావు వ్యవధిలో 5 ట్రిప్పులు వేస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌టీసీ రీజనల్ మేనేజర్ అప్పలరాజు, సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్, కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మడి రమణ, వార్డు అధ్యక్షులు బొడ్డేటి విజయ్, నారిపిన్ని సత్తిరాజు, యలమంచిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనాల సాగు లాభదాయకం



రైతుల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు



సదస్సుకు హాజరైన దుకాణదారులు

విశాఖ విద్య : ఉద్యానవనాల సాగు ఎంతో లాభదాయకమని జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణ రెడ్డి అన్నారు. మద్రిపాలెం రైతు బజారులో మంగళవారం ఉద్యానవనాల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇళ్ల వద్ద సాగు చేస్తూ, రైతు బజార్లలో విక్రయాలకు కూరగాయలు తీసుకొస్తున్న పలువురు రైతులతో మాట్లాడారు. సాగులో వారి అనుభవాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన వనాల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. తక్కువ విస్తీర్ణంలోనే రోజువారీ ఆదాయం సంపాదించేలా పంటలు పండించవచ్చన్నారు. విత్తనాల కొనుగోలు, ఎరువుల వాడకం గురించి పూర్తి స్థాయిలో తెలుసుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ పరంగా అందించే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యానవన శాఖాధికారి సోని, విస్తరణ అధికారి త్రినాథ్, రైతుబజారు ఎస్టేట్ అధికారి కొమ్మనాపల్లి వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకుంటే ప్రాణాపాయం



జడ్జి సౌజన్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

భీమునిపట్నం : ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి డి.సౌజన్య సూచించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగం ఆవశ్యకతపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల్లో చాలా మంది అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది చాలా బాధాకర విషయమన్నారు. ఈ విషయంలో ఎవరూ అజాగ్రత్తగా ఉండకూడదని, తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ర్యాలీలో డైట్ ఛాత్రోపాధ్యాయులు, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు ఎం.వి.పార్వతీశం, కార్యదర్శి కె.ఎస్.ఎం.సుధాకర్, కోశాధికారి ముమ్మిడిశెట్టి సునీల్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని రహదారి



అధ్వానంగా గురుద్వార్ నుంచి ఏపీఈపీడీసీఎల్‌కు వెళ్లే రహదారి

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి 14 వార్డులోని ఏపీఈపీడీసీఎల్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. గురుద్వార్ నుంచి ఏపీఈపీడీసీఎల్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు ఒక వైపు పూర్తిగా మరమ్మతులకు గురవడంతో రాత్రి పూట వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఘనంగా జగన్నాథుని తిరుగు రథయాత్ర

అగనంపూడి: జగన్నాథుడి తిరుగు రథయాత్రను అగనంపూడిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామి వారిని కల్కి అవతారంలో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. మధ్యాహ్నం మహానైవేద్యం సమర్పించారు. సాయంత్రం ఇంద్రద్యుమ్న హాల్లో ఉన్న ఉత్సవమూర్తులను ఆలయ పూర్వీకులు, పండా కుటుంబీకులు గురు మోహన్, సంతోష్ రథంపైకి చేర్చిన అనంతరం తిరుగు రథయాత్ర ప్రారంభమైంది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు రథాన్ని ఆలయం వద్దకు చేర్చారు. దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయగా, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, బొండా జగన్, ఉత్సవ కమిటీ చైర్మన్ కరణం పైడిరాజు, ప్రతినిధులు గళ్ల సాయికుమార్, మామిడి నాగేశ్వరరావు, నాగమణి, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రథయాత్రలో పాల్గొన్న భక్తులు

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

సీతమ్మధార: విశాఖ నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దర్ని ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్.విజయకుమార్ తెలిపిన వివరాలు ఇలా.. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 24 కిలోల గంజాయిని తమిళనాడుకు చెందిన ప్రేమనిసార్, శిశురాజులు కొనుగోలు చేసి సోమవారం రాత్రి రెండు బ్యాగులతో విశాఖ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. సమాచారం తెలుసుకున్న ఫోర్తు టౌన్ పోలీసులు వారిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయి తేస్తే నగదు ఇస్తానని తమిళనాడుకు చెందిన రియాజ్ అనడంతో అరకు వచ్చి గొనుగోలు చేశామని నిందితులు వెల్లడించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

- తుప్పు పట్టిన వాహనాలను తరలించాలి
- చీకటి పడితే మరింత ఇబ్బందులు
- ట్రాఫిక్ పోలీసుల స్పందన కరవు



కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ బీఆర్‌టీఎస్ రహదారిలో వాహనాల అక్రమ పార్కింగ్



జ్ఞానాపురానికి వెళ్లే రహదారిలో ట్రాఫిక్ ఇబ్బందులు

కంచరపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌తో వాహన చోదకులు, స్థానికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన, అంతర్గ రహదారులపై భారీ లారీలు, ట్రావెల్ బస్సులు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెంకు, ఇటు కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ నుంచి జ్ఞానాపురానికి వెళ్లే రహదారుల్లో వాహనాలను నిలుపుతుండడంతో వాహనదారులు, పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. రెండేసి వరుసల్లో వాహనాలు నిలిపి మరమ్మతులు చేపడుతున్నారు. నెలలు తరబడి రోడ్లపై వాహనాలు నిలపడంతో చెత్తచెదారాలు, మట్టి గుట్టలుగా పేరుకుపోతున్నాయి. దీంతో శానిటరీ సిబ్బంది వాటిని ఊడ్చే పనులు వదులుకున్నారు. ఇరుకురోడ్లపై వాహనాలు నిలిపే కారణంగా కొన్నిసార్లు ప్రమాదాల బారిన కూడా పడుతున్నారు. కంచరపాలెం ఫ్లైఓవర్ మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలు ఎక్కడ పడితే అక్కడ నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలకు అడ్డూ లేకుండా పోతోంది. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ట్రాఫిక్ పోలీసులు వ్యవహరిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి వాహనాలు తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని వాహనదారులు, పాదచారులు, స్థానికులు కోరుతున్నారు.



కంచరపాలేనికి వెళ్లే రహదారికి ఇరువైపులా వాహనాల మరమ్మతులు

